

వైద్యసేవలకు ఆటంకం కలగకుండా చర్యలు

పార్వతీపురం, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని కొద్దిరోజులుగా పీహెచ్‌సీ వైద్యులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో వైద్య సేవలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక విలేఖర్లతో ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఏ ఇబ్బంది కలగకుండా చూస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందితో సేవలు అందిస్తున్నామని చెప్పారు. వైద్యులతో నిరంతరం సంప్రదిస్తున్నామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నామినేటెడ్ సందడి

- కార్పొరేషన్లకు చైర్మన్లు, సభ్యులను నియమించిన ప్రభుత్వం
- అందులో జిల్లావాసులకు దక్కిన చోటు
- సర్వత్రా హర్షాతిరేకాలు

జియ్యమ్మవలస/ కురుపాం/ గుమ్మలక్ష్మీపురం/ సాలూరు రూరల్, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. ఈ మేరకు మంళవారం జాబితాను విడుదల చేసింది. మొత్తంగా 20 కార్పొరేషన్లకు చైర్మన్లు, సభ్యులను నియమించింది. ఇందులో జిల్లా నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన వారికి సీఎం చంద్రబాబు ఈ జాబితాలో పెద్దపీట వేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా తమ్మిరెడ్డి

ఆంధ్రప్రదేశ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఎంఈడీసీ) చైర్మన్‌గా జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి శివశంకర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్‌గా పనిచేసేవారు. స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసి జనసేనలో చేరారు. ఆ పార్టీలో కీలక పాత్ర పోషించిన శివశంకర్ 2024 ఎన్నికల్లో విశాఖ జిల్లా పెందుర్తి అసెంబ్లీ టిక్కెట్టు ఆశించారు. కానీ కూటమి సీట్ల సర్దుబాటులో ఆ అవకాశం దక్కలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సన్నిహితుల్లో ఒకరైన ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆ పదవికి ఎంపిక చేయడంపై స్వగ్రామం పెదబుడ్డిడిలో సంబరాలు మిన్నంటాయి. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



ట్రైకార్ మెంబరుగా లావణ్య..

కురుపాం టీడీపీ నాయకురాలు పువ్వల లావణ్యను ఏపీ ట్రైకార్ మెంబర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రైకార్ బోర్డు చైర్మన్‌గా బోరుగల శ్రీనివాస్‌తో పాటు ముగ్గురు సభ్యుల పేర్లు విడుదల చేశారు. లావణ్య స్వగ్రామం పాత కురుపాం. అత్తివారిది గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గ్రామం. ప్రస్తుతం ఆమె బొబ్బిలిలో ఉంటున్నారు. లావణ్య భర్త సీహెచ్‌సీ వైద్యుడిగా పనిచేస్తున్నారు. కాగా ఈ సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ ఆశించారు. కాగా ఆమె ట్రైకార్ బోర్డు మెంబర్‌గా నియమితులవడంపై స్థానిక టీడీపీ నాయకులు, గిరిజన సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన రైతులకు ట్రైకార్ రుణాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



పౌరసరఫరాల సంస్థ సభ్యునిగా భంజ్‌దేవ్..

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (కార్పొరేషన్) సభ్యునిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సాలూరు మాజీ ఎమ్మెల్యే రాజేంద్రప్రతాప్ భంజ్‌దేవ్ నియమితులయ్యారు. సివిల్ సప్లయిస్ చైర్మన్‌గా తోట మెహెర్ సీతారామ సుధీర్ (జనసేన)తో పాటు మరో 15 మంది సభ్యులను ప్రభుత్వం నియమించింది. కాగా ఈ సభ్యుల్లో భంజ్‌దేవ్‌కు స్థానం కల్పించారు. ఆయన సాలూరుకు 1994, 1999, 2004 ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014,2019 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. టీడీపీ స్థాపించిన నుంచి పార్టీకి సేవలందిస్తు వస్తున్నారు.

ఇంటర్ తర్వాత ఇంటికేనా?

- ఉన్నత విద్యకు నోచుకోని భామిని విద్యార్థులు
- డిగ్రీ కళాశాల ఏర్పాటుపై వైసీపీ పాలకులు ఇచ్చిన హామీ గాలిలో..
- ఏటా 400 మందికి ఇబ్బందులు
- ప్రభుత్వం స్పందించాలని విన్నపం



భామిని: భామిని మండలంలో విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారింది. ఇంటర్ మీడియట్ వరకూ ఏ ఇబ్బందులు లేకపో యినప్పటికీ డిగ్రీ చదవాలంటే మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో అత్యధి కులు ఇంటర్ తర్వాత ఇంటికే పరిమితమవ్వాల్సిన పరిస్థితి. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక.. ఆర్థిక స్తోమత లేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. భామినిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని గతంలో పాలకొండ వైసీపీ ఎమ్మెల్యే కళావతి ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. దీంతో ఈ ప్రాంతవాసులు మండిపడుతు న్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎన్నికల హామీగానే మిగిలిపోయిందని ఆవేదన చెందుతున్నారు. వాస్తవంగా భామినిలో ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఆర్ అంబేడ్కర్ గురుకులం, కేజీబీవీలో ఏటా ఇంటర్, ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 650 మంది వరకూ చదువుతున్నారు. వారిలో సుమారు 400 మంది ఉత్తీర్ణులవుతున్నారు. అయితే ఇంటర్ అయ్యాక మాత్రం వారు ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారు. భామిని, బత్తిలి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తూరు వెళ్లి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో చదవాలంటే.. దూరాభారంతో పాటు వ్యవ ప్రయాసలకు గురవ్వాల్సి వస్తోంది. ఇక పాలిటెక్నిక్, ఐటీఐ, టీచర్ ట్రైనింగ్ ఇతరత్రా ఏ చదువులకైనా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో మండలంలో నిరుపేద విద్యార్థులు ఇంటర్ తర్వాత చదువులకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. దీనిపై నూతన ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని భామిని మండలవాసులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల అవసరం

భామిని మండలంలో చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు చదివేందుకు డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుబాటులో కళాశాల ఉంటే ముఖ్యంగా బాలికలు చదివే అవకాశాలు ఉన్నాయి. రోజూ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లి రావడం వారికి ఇబ్బంది. పోటీ ప్రపంచంలో కనీసం డిగ్రీ వరకు చదువుకుంటే వారి కాళ్లమీద వారు నిలబడతారు.

\- ఎం.విజయనిర్మల, ప్రిన్సిపాల్, అంబేడ్కర్ బాలికల గురుకులం, భామిని



భామిని ఆదర్శ పాఠశాల

ఏర్పాటు చేయాలి

భామిని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. అయితే వచ్చే ఏడాది డిగ్రీ ఎలా చదవాలో అర్థం కావడం లేదు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయి.

\- జి.మౌనిక, ఇంటర్, కాట్రగడ

టైలరింగ్ చేస్తున్నా..

స్థానికంగా ఇంటర్ వరకు చదివాను. ఆ తర్వాత దూర ప్రాంతాలకు బస్సులో వెళ్లి చదవుకోలేక పోయా. ప్రస్తుతం ఇంటివద్ద టైలరింగ్ చేస్తున్నాను. భామినిలో డిగ్రీ కళాశాల ఉంటే తప్పనిసరిగా చదువుకునేదాన్ని.

\- పోతల లావణ్య, భామిని

ఉపాధి క్షేత్ర సహాయకురాలికి షోకాజ్ నోటీసు

గరుగుబిల్లి, సెప్టెంబరు 24 : గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉపాధి క్షేత్ర సహాయకురాలు టి.స్వాతికి డ్వామా పీడీ కె.రామచంద్రరావు మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వాడుకున్న మొత్తాలను తిరిగి కార్యాలయానికి జమ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు చర్యలు తీసు కోవాలని ఎంపీడీవో జి.పైడి తల్లి, ఉపాధి ఏపీవో ఎం.గౌరీనాథ్‌లకు సూచించారు. పంచాయతీలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో క్షేత్ర సహాయకురాలు పలు అక్రమాలకు పాల్పడ్డారని వచ్చిన అభియోగాలపై కొద్ది రోజుల కిందట అధికారులు విచారణ చేపట్టి.. నివేదికలు అందిం చారు. గ్రామంలో ఒక్కో వేతనదారు నుంచి రూ.100 చొప్పున వసూలు చేయడంతో పాటు పనుల ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన నేమ్ బోర్డుల బిల్లులు వ్యక్తిగత బ్యాంకుల్లో వేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అదేవిధంగా ఉపాధి పనులకు వెళ్లని వారు, మృతి చెందిన, ఇతర గ్రామాల్లో ఉన్న వారి పేరున మస్తర్లు వేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారణ అనంతరం ఉన్నతాధికారులు క్షేత్ర సహాయకురాలికి నోటీసు ఇచ్చారు.

సివిల్ సప్లైస్ డీఎంగా శ్రీనివాసరావు

పార్వతీపురం, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్‌గా పి.శ్రీనివాసరావు నియామకమయ్యారు. ఇప్పటివరకు పనిచేసిన ఎండీ నాయక్ కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కుమార్

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కేవీఎస్ఎన్ కుమార్ నియమితులయ్యారు. శ్రీశైలం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై మన్యం జిల్లాకు వస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం

- వేడుకల నిర్వహణపై సబ్ కలెక్టర్ సమీక్ష

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వచ్చేనెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరసరా ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కోటదుర్గమ్మ ఆలయానికి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. క్యూలైన్లలో భక్తులు ఎక్కువసేపు నిరీక్షించకుండా చూడాలని, అమ్మవారి దర్శనం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవో మురళీ కృష్ణ, డీఎస్పీ రాంబాబు, కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బడిదేవర కొండపై తవ్వకాలొద్దు

- అనుమతులు రద్దు చేయాలని గిరిజనుల డిమాండ్
- కలెక్టరేట్, అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన

బెలగాం, సెప్టెంబరు 24: బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్, అటవీశాఖ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. పార్వతీపురం మండలం డోకిశిలలో బడిదేవర కొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతమైనప్పటికీ మైనింగ్ అనుమతులు ఎలా ఇచ్చారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి ప్రశ్నించారు. 2017లో గ్రానైట్ తవ్వకాలకు అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇస్తే.. ఆ కొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని అటవీశాఖ అధికారులే ధ్రువీకరించారని గుర్తు చేశారు. అక్కడ గిరిజనులకు పోడు పట్టాలు కూడా ఇచ్చారని తెలిపారు. తాజాగా ఇప్పుడు మళ్లీ బడిదేవరకొండపై తవ్వకాలకు అనుమతులు ఇచ్చి, పోడు పట్టాలు రద్దు చేయడం అన్యాయమన్నారు. మైనింగ్ అనుమతులు రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసనలో గిరిజన , రైతు సంఘాల నాయకులు రాము, చిరంజీవి, బాష, దాసు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు


పైడిమాంబకు పట్టు వస్త్రాలు అందించనున్న మంత్రి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 24: పైడిమాంబ సిరిమానోత్సవం రోజున ప్రభుత్వం తరపున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజు ఎన్ని గంటలకు మంత్రి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నది అక్టోబరు నెల 4 లేదా 5న ఖరారు కానుంది. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్టోబరు 3న ఆయన తిరిగి విజయవాడకు రానున్నారు. అక్కడి నుంచి 4వ తేదీ ఉదయం విజయనగరం చేరుకోనున్నారు.

వాణిజ్య పంటల సాగు బహు బాగు

- ఏజెన్సీలో విస్తారంగా పత్తి, అరటి, వేరుశనగ, మొక్కజొన్న సాగు
- ఆసక్తి చూపుతున్న గిరిజన రైతులు
- ఆశించిన స్థాయిలో దిగుబడులు
- అందుతున్న గిట్టుబాటు ధర
- ప్రభుత్వం, అధికారుల ప్రోత్సాహం


అడ్డంగూడలో సాగవుతున్న పత్తి



గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో గిరిజన రైతులు వాణిజ్య పంటలపై మొగ్గు చూపుతున్నారు. జీడి, పసుపుతో పాటు పత్తి, అరటి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వాస్తవంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో గిరిజనులు కొండపోడు, మెట్టు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గతంలో వారంతా కొండపోడులో కొర్రలు, గంటెలు, రాగులు, సామలు, ఊదలు తదితర వాటిని తమ ఆహారానికి సరిపడేలా పండించేవారు. వేసవిలో వ్యవసాయ కూలీలుగా మారేవారు. మరి కొందరు ఇతర పనుల్లోకి వెళ్లిపోయే వారు. అయితే ప్రస్తుతం వారిలో అక్షరాస్యత శాతం పెరిగింది. మరోవైపు కూటమి ప్రభుత్వం వివిధ పథకాలు అందిస్తుండగా, వ్యవసాయ శాఖ నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తోంది. దీంతో గిరిజన రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించారు. ఆ రెండు మండలాల్లోని 60 గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో వారు పత్తి, అరటి, వేరుశెనగ, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఆయా పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండగా, గిట్టుబాటు ధరకు ఎటువంటి ఢోకా ఉండడం లేదు. దీంతో ఒకరిని చూసి ఒకరు అన్నట్లుగా మెజారిటీ గిరిజన రైతులు వాటి సాగుపై మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,500 వరకు మద్దతు ధర ప్రకటించింది. గిరిజన రైతులకు ఇది కలిసొచ్చేలా ఉంది. ఈ ప్రాంతం పూర్తిగా మెట్టు కావడంతో పత్తి పంట మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.


పి.ఆమిటిలో అరటి


లక్కగూడలో మొక్కజొన్న

'వాణిజ్య పంటల సాగు వల్ల గిరిజన రైతుల శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. అందుకే అత్యధికులు ఆయా పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఇటువంటి వారికి వ్యవసాయశాఖ ద్వారా తగిన ప్రోత్సాహం అందిస్తున్నాం. సాగులో నూతన మెల కువలు చెబుతున్నాం. ఎరువుల వాడకంపై అవ గాహన కల్పిస్తున్నాం.' అని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు.

పీఎంశ్రీకి 19 పాఠశాలల ఎంపిక

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి జిల్లా నుంచి 19 పాఠశాలలు ఎంపికైనట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన వాటిల్లో రెండు ప్రాథమిక పాఠశాలలు, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల్లో జాతీయ విద్యా విధానం అమల్లో ఉంటుందని తెలిపారు. 2026-27 వరకు ఈ పథకం అమలవు తుందని చెప్పారు. ఈ 19 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పీఎంశ్రీ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డీఈవో పగడాలమ్మ, పీఎంయూ నోడల్ అధికారి పి.లక్ష్మీకాంత్ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

యువత ఉన్నత లక్ష్యాలు సాధించాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ చదివిన వారు పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ జాబ్‌మేళాలో అరబిందో ఫార్మసీ, అవంతి ఫీడ్స్ లిమిటెడ్, జీఎంఆర్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలు పాల్గొన్నారు. మొత్తం 543 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 95 మంది ఎంపిక కాగా అందులో అవంతి ఫీడ్స్ లిమిటెడ్‌కు 65, జీఎంఆర్ సెక్యూరిటీకి 30 మంది ఎంపికయ్యారు. ఎమ్మెల్యే విజయచంద్ర, ప్రాజెక్టు ఆఫీసర్ అశుతోష్ శ్రీవాస్తవ ఎంపిక పత్రాలను అందించారు.

పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. పట్టణంలోని కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.40.20 లక్షలతో నిర్మించిన నూతన అదనపు పాఠశాల గదులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, హెచ్‌ఎం అప్పలనాయుడు, 8వ వార్డు కౌన్సిలర్ కె.నారాయణరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

● సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జియ్యమ్మవలస: విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం చూపిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీవీ సీతారామయ్య, డీటీ ఆర్.పకీరు, సిబ్బంది, వీఆర్వోలతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన ధ్రువపత్రాలు ఇచ్చేయ్యాలన్నారు. అలాగే ఉన్నతాధికారులకు పంపాల్సిన నివేదికలు, ఉన్నతాధికారులు చెప్పిన వివిధ అంశాలను సకాలంలో వారికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

భామిని: సచివాలయ సిబ్బంది గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి వై.సత్యనారాయణనాయుడు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులు, అనర్హులను అధికారులే నిర్ణయించాలన్నారు. ప్రతి చిన్న విషయం జిల్లా స్థాయికి వెళ్లకుండా స్థానిక ప్రజావేదికలో పరిష్కరించాలన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యంపై ఐదేళ్ల ప్రణాళిక ప్రతి శాఖ సిద్ధం చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో భామిని మండలం వెనుకంజలో ఉందని, పైస్థాయికి తీసుకెళ్లాలన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

భామిని గ్రామ సమీపంలో జగనన్న కాలనీలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్లను సత్యనారాయణనాయుడు మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులను ఆరా తీశారు. విద్యుత్, నీటి సౌకర్యం లేకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామని లబ్ధిదారులు చెప్పారు. మండలంలోని మంజూరైన ఇళ్ల పరిస్థితిపై ఏఈని అడిగి తెలుసుకున్నారు. 1179 గృహాలు మంజూరు కాగా 347 గృహాలు ఇంకా ప్రారంభం లేదన్నారు. వేగవంతంగా నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. లేకపోతే ఇళ్లు రద్దు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రరావు, తహసీల్దార్ శేఖరం, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ ఉన్నారు.

మేం ప్రజాప్రతినిధులం కాదా?

● సాలూరు మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

సాలూరు రూరల్: తాము ప్రజాప్రతినిధులం కాదా.. అభివృద్ధి పనులపై అధికారు లు తమకు కనీస సమాచారం ఇవ్వ డం లేదంటూ పలువురు సర్పంచ్ లు మండిపడ్డారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో ఎంపీపీ రాములమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి పనులపై తమకు సమాచారం ఇవ్వడం లేదంటూ వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, శివరాంపురం సర్పంచ్ జరజాపు మోహనరావు, పార్నవలస సర్పంచ్ లక్ష్మణరావు తదితరులు ధ్వజమెత్తారు. విద్యుత్ సమస్యలపై తోణాం సర్పంచ్ మువ్వల ఆదియ్య సారిక సర్పంచ్ గొర్లె సత్యవతి, కోఆప్షన్ సభ్యుడు గుడివాడ సూర్యనారాయణ ప్రస్తావించారు. పాఠశాలల్లో పని సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను తగ్గించడం సరికాదని శివరాంపురం ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథరావు అన్నారు. పింఛన్ పంపిణీ సమయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు టీడీపీ నేతలు ఉండడం సరికాదని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అభ్యంతరం చెప్పారు. తమ హక్కులు కాలరాస్తే పోరాడతామని సభ్యులన్నారు. పలు అంశాలపై ఎంపీడీవో పార్వతి వివరణనిచ్చి సభ్యులను శాంతపర్చారు. కార్యక్రమంలో రెండవ వైస్ ఎంపీపీ సువ్వాడ గుణవతి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత క్రికెట్ పోటీలకు ఎంపిక

సాలూరు రూరల్: తమిళనాడు కడలూరులో వచ్చే నెల జరగనున్న దక్షిణ భారత టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ చెప్పారు. వారు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరులో ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ కెప్టెన్‌గా తమ పాఠశాలకు చెందిన నూతన్ బహుమతి పొందారన్నారు. అలాగే దక్షిణ భారత టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన సాగర్, చైతన్య ఎంపికైనట్టు చెప్పారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను తమ జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్ అభినందించారన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

రాయగడ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి అంటురోగాలు దరిచేరవని విశ్రాంత హోమియో వైద్యుడు, జాతీయ ప్రాథమిక సంరక్షణ శిక్షకుడు లక్ష్మీనారాయణ సాహు అన్నారు. మంగళవారం స్థానిక స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ బాబిలత షారాఫ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. అధ్యాపకులు భాస్కరగుప్తా, మోనాలిసా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తెరిపించండి

రాయగడ: రాయగడ జిల్లా బొడో అల్లుబడి పంచాయతీ శిఖరపాడు గ్రామంలో దశాబ్దన్నర కాలం నుంచి మూతపడి ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని తెరిపించాలని ఆ గ్రామస్థులు జిల్లా అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రం మూతపడి ఉన్న కారణంగా ఏ చిన్న సమస్య వచ్చినా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొల్నార ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. అక్కడ సరైన చికిత్స అందకపోతే మరో 20 కిలోమీటర్లు పయనించి రాయగడ జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నామని, ఇందుకోసం ఆటోలకు రూ.3వేలు ఖర్చవుతుందని వాపోయారు. 2005లో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం 2006లోనే మూతపడిందని, వెంటనే దీనిని తెరిపించాలని వారు కోరారు.

ఒడిశా

వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం

రాయగడ: స్థానిక అర్బన్ ఆసుపత్రిలో జిల్లా స్థాయి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారందరికీ, అలాగే గత ఐదేళ్లలో క్షయవ్యాధి బారిన పడిన 18 ఏళ్లు నిండినవారికి బీసీజీ టీకాలు వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం

● కొనసాగుతున్న 'ఇది మంచి ప్రభుత్వం'

● కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు



బలిజిపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యే జగదీశ్వరికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ ప్రగతిపై ప్రచారం చేస్తున్నారు.

బలిజిపేట: రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. నారంనాయుడువలస గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ జేడీ రాబర్ట్‌పాల్, పార్టీ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, గ్రామ సర్పంచ్ ఎస్.వెంకటరమణ, టీడీపీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రవికుమార్, గొట్టాపు వెంకటనాయుడు, మండల పెదపాపినాయుడు, ఎంపీడీవో విజయలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం: సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. చినవంకదార గ్రామం లో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల ప్రభుత్వ పనితీరును వివరించారు. స్టిక్కర్లను అంటించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డీడీ రావు, ఎంపీడీవో గౌరీశంకరరావు, ఏడీఏ ఆర్.శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

● గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

● రైతులకు అవగాహన

బలిజిపేట: రైతులు మట్టి పరీక్షల ఫలితాలు ఆధారంగా ఎరువులు వినియోగించాలని, అప్పుడే పంటకు పోషకాలు అందుతాయని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నారాన్నాయుడువలసలో మంగళవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామంలో పొలాలను పరిశీలించా రు. తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ ఎస్.వెంక టరమణ, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ సంచాలకురాలు శారద పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: రైతులు వరి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి అన్నారు. మండలంలోని తోటపల్లి, సంతోషపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వరి పంటకు ఆశించే తెగుళ్లపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి, గిజబ, సంతోషపురం, సుంకి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ● భామిని: పంట పొలాలకు చీడపీడ లు సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి సింహాచలం సూచించారు. మండలంలోని బాలేరు, ఘనసర గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి, చెరకు, మొక్కజొన్న పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు జ్యోతి, ఆయి, భవానీ, రైతులు పాల్గొన్నారు. ● మక్కువ: మట్టి పరీక్షలతో సారవంతం అవుతుందని ఏవో బొత్స శ్రీనివాసరావు అన్నారు. సరాయివలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వీఏ త్రివేణి, రైతులు పాల్గొన్నారు. ● వీరఘట్టం: కత్తులకవిటి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని



సీతంపేట రూరల్: కిల్లాడలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

మంగళవారం నిర్వహించా రు. ఏవో సౌజన్య పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క రైతు ఈక్రాప్ చేయించుకో వాలన్నారు. సర్పంచ్ ప్రతినిధి సుదర్శనరావు, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: గిరిజన రైతులు సేంద్రియ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని పాలకొండ ఏడీఏ రత్నకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని కిల్లాడ, పెదపొల్ల పంచాయతీల్లో వ్యవసాయశాఖ ఏవో శ్రీదేవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో, హెచ్‌వో పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు



ఐలవ్ సీతంపేట సింబల్‌ను పరిశీలిస్తున్న ఏపీవో, డీడీ

సీతంపేట రూరల్: సీతంపేట కేంద్రంగా ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో జరుగుతున్న పనులను ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర పరిశీలించారు. పార్క్ వేదికగా నిర్వహించనున్న పర్యాటక దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇది వరకే ఆదేశాల జారీ చేశారు. ఈనేపథ్యంలో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో మట్టి, బురద తొలగించే పనులు చేపట్టారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు సాహసోపేతమైన పారా మోటరింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. పార్క్‌లో గడచిన కొన్ని నెలలుగా మూలకు చేరిన ఆల్‌టెర్రయిన్ వెహికల్స్, బుల్‌రైడ్, గైరో వంటి సాహసోపేతమైన క్రీడా యంత్రాలను పునరుద్ధరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతే కాకుండా సీతంపేట ఏజెన్సీ అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు ఫొటో షూట్ చేసుకునేందుకు వీలుగా ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో ఐ లవ్ సీతంపేట అనే సింబల్‌ను నిర్మిస్తున్నారు. ఈ ఏర్పాట్ల పర్యవేక్షణలో డీపీవో సతీష్, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి కూడా ఉత్సవ ఏర్పాట్లు పరిశీలనకు ఎన్టీఆర్ ఎడ్వంచర్ పార్క్‌కి వచ్చారు.

విద్యారంగ సమస్యల సాధనే యూటీఎఫ్ లక్ష్యం

సీతానగరం: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కార సాధనకు యూటీఎఫ్ నిరంతర కృషి చేస్తుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్ అన్నారు. గాదెలవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్వర్ణోత్సవాల్లో ప్రతిఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని, అలాగే సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలను సందర్శించి, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, సీతానగరం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.గోవిందరావుతో పాటు అన్ని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

సాలూరు రూరల్: ఒడిశా నుంచి ఏపీకి స్కూటీలపై తరలిస్తున్న గంజాయిని జీగిరాం వద్ద స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశామని సాలూరు రూరల్ ఎస్‌ఐ పి.నర్సింహమూర్తి చెప్పారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. జీగిరాం వద్ద జరిపిన వాహన తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం పొట్టంగి ప్రాంతం నుంచి సాలూరు వైపు గంజాయి తరలిస్తున్న రెండు స్కూటీలను పట్టుకున్నామని చెప్పారు. వాహన చోదకుల్లో ఒకరు పరారు కాగా, మరో వ్యక్తి ఒడిశా రాష్ట్రం గంగరాజుపూర్‌కు చెందిన సుశాంత్ బంకను అరెస్టు చేశామన్నారు. రెండు వాహనాల్లో ఉన్న 24.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్

గరుగుబిల్లి: మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో ఆయన మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు వేగవంతానికి ఈనెల 28న లబ్ధిదారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోగా ఇళ్లు పూర్తి చేయకుంటే రద్దయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గృహ నిర్మాణాలకు యూనిట్ ధర రూ.1.80 లక్షలతో పాటు స్వయం సహాయక సభ్యులకు రూ.30 వేలు రుణం మంజూరు చేస్తారని తెలిపారు. డిసెంబరు నెలాంతానికి పూర్తి చేసేందుకు దృష్టి సారించాలన్నారు. మండలానికి సంబంధించి సొంత స్థలాల్లో 254 మందికి, లేఅవుట్లలో 242 మందికి నిర్మాణాలు గతంలో మంజూరయ్యాయని తెలిపారు. 496 మందికి సంబంధించి 168 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. లేఅవుట్లు పరిధిలో తాగునీరు, విద్యుత్‌తో పాటు మౌలిక వసతులు కల్పనపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు, గృహ నిర్మాణశాఖ జేఈ వి.అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ చికిత్స అందించాలి



మలేరియా బాధితులను పరామర్శిస్తున్న ఏఎంవో సూర్యనారాయణ

కొమరాడ: క్షేత్ర స్థాయిలో జ్వర పీడితులకు సంపూర్ణ చికిత్స అందించాలని ఏఎంవో సూర్యనారాయణ అన్నారు. జిల్లా కన్సల్టెంట్ రామచంద్రుడుతో కలిసి ఆయన మంగళవారం మాదలింగి పీహెచ్‌సీని సందర్శించారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశమై మలేరియా, డెంగ్యూ కేసుల స్థితిగతులపై చర్చించారు. అనంతరం కెమిశీల గ్రామంలో ఇటీవల మలేరియాకు గురైన ఇద్దరిని పరామర్శించారు. వారి ప్రస్తుత ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. కెమిశీల గ్రామంలోగల గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. వసతిగృహంలో సిక్ రూంను ఏర్పాటు చేయాలని, అనారోగ్య విద్యార్థులను ఐసోలేషన్‌లో ఉంచాలని వార్డెన్‌కు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ విస్తరణాధికారి వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

పాచిపెంట: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని చైల్డ్‌ఫండ్ ఇండియా సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ ప్రోగ్రాం ఇంప్లిమెంటర్ అభి సరస్వతిబాబు అన్నారు. మంగళవారం కూనంబందవలస పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించారు. గిరిజనులు తప్పనిసరిగా విద్య నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ చల్లా కిరణ్‌కుమార్, కమ్యూనిటీ మొబిలైజర్ రాంబాబు, హెచ్‌ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత ఉండాలన్నారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు వేమూరి హరగోపాల్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ ఆవశ్యకతను వివరించారు. అధ్యాపకుడు పైల శంకరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. ● బెలగాం: ప్రతివిద్యార్థి ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సమాజ సేవలో పాలుపంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు కళాశాల నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బెలగాం: ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

రహదారిపై కూలిన చెట్టు

క్లుప్తంగా..



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

సీతానగరం: అప్పయ్యపేట గ్రామంలో మంగళవారం ఉదయం రోడ్డుకు అడ్డంగా భారీ చింత చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనివల్ల కొద్దిసమయం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీతానగరం పోలీ సులు స్పందించి చెట్టును తొలగింపజేశారు.

కురుపాం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శిగా సన్యాసినాయుడు

గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వ్యక్తిగత కార్యదర్శిగా అడ్డాకుల సన్యాసినాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఎమ్మెల్యే జగదీశ్వరి భర్త. వ్యక్తిగత కార్యదర్శిగా ఎమ్మెల్యే జగదీశ్వరికి సహకరించి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని సన్యాసినాయుడు తెలిపారు.

పాఠశాలలకు విత్తనాల పంపిణీ

కురుపాం: మన బడి మన తోట పథకంలో భాగంగా మంగళవారం కురుపాం ఎమ్మార్సీలో ఎంఈవో ఎన్.సత్యనారాయణ పాఠశాల హెచ్‌ఎంలకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 144 పాఠశాలలో ఆకుకూరలు, కూరగాయలు పండించడానికి విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

సారా ధ్వంసం

సీతంపేట రూరల్: సీతంపేట, దోనుబాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ 1,324 లీటర్ల సారాను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి సమక్షంలో మంగళవారం పారబోశారు. ఈ ఏడాదిలో అక్రమంగా తరలించిన 36 సారా కేసుల్లో పట్టుబడ్డ సారాను మద్యవర్తుల సమక్షంలో నిర్వీర్యం చేసినట్లు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

పౌష్టికాహార ఆవశ్యకతను తెలుసుకోండి

మక్కువ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార ఆవశ్యకతను తెలుసుకోవాలని ఐసీడీఎస్ పీవో ఎంఎన్ రాణి అన్నారు. కన్నంపేట అంగన్‌వాడీ కేంద్రం-1లో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బి.అనంతలక్ష్మి, ఎంపీడీవో సూర్యనారాయణ, సర్పంచ్ బలగ సావిత్రి, సూపర్‌వైజర్లు రాజశ్రీ, లీలావతి, సచివాలయ సిబ్బంద పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయలేకే లడ్డూ వివాదం

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ వాగ్దానాలను అమలు చేయలేకే తిరుమలలో కల్తీ నెయ్యి, లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చిందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్లు మినహా ఏమి చేయలేక చేతులెత్తేసిందన్నారు. అన్న క్యాంటీన్లు సంక్షేమ పథకం కాదన్నారు. ఆయనతో సాలూరు ఎంపీపీ రాములమ్మ, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి తదితరులు ఉన్నారు.

వసతిగృహానికి ఫ్యాన్లు వితరణ

సాలూరు రూరల్: డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు తన కొడుకు యువాన్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సాలూరులోని గిరిజన గర్భిణుల వసతి గృహానికి ఫ్యాన్లు, బెడ్‌షీట్లు వితరణ చేశారు. అలాగే గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. వసతిగృహంలో ఉన్న 17 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు చేశారు. మేనేజర్ సాగర్, నీడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, సూపర్‌వైజర్ జయగౌడ్, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా పైడిమారమ్మ వారాల పండుగ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కురుపాం: కురుపాం గ్రామ దేవత పైడిమారమ్మ తల్లి వారాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా వనంగుడికి వెళ్లి భక్తి శ్రద్ధతో మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300





కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ బదిలీ

కొత్తవలస: కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సిబ్బంది అందరికీ ఇక్కడ నుంచి బదిలీ చేశారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న టి.తారకేష్‌ను గాజువాక సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్ స్థానంలో గజపతినగరం సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న చిన్నమ్మలను నియమించారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్ తేజను శృంగవరపుకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

హెచ్‌డీటీగా రమేష్

లక్కవరపుకోట: బదిలీల్లో భాగంగా మండల హెడ్ క్వార్టర్ డిప్యూటీ తహసీల్దార్‌గా టి.రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. రమేష్ కొత్తవలస సీఎస్‌డీటీగా పనిచేస్తున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.రవికుమార్‌ను ఎల్.కోట మండల తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా నియమించినట్లు తెలిపారు.

ఎంఎస్‌ఎంఈ చైర్మన్‌కు అభినందనలు

శృంగవరపుకోట: ఏపీ ఎంఎస్‌ఎంఈ చైర్మన్‌గా నియమితులైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను మంగళవారం శృంగవరపుకోట జనసేన నేత ఒబ్బిన సన్యాసినాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. జిందాల్ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

విజయనగరం రింగురోడ్డు: రాష్ట్రాభివృద్ధి సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ పి నల్లనయ్య పిలుపునిచ్చారు. మంగళవారం 11 వ డివిజన్‌లోని కాటవీధి వద్ద మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కు ప్రాంతంలో మొక్కలు నాటారు. నగరపాలక సంస్థ అధికారులు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, చుక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బదిలీ అధికారులు

కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో వివిధ హోదాల్లో పని చేస్తూ ఇతర జిల్లాలకు బదిలీ అయిన పలువురు జిల్లా స్థాయి, అధికారులు మంగళవారం జిల్లా కలెక్టరు అంబేడ్కర్‌ను కలెక్టరు కార్యాలయంలో కలిశారు. వారందరినీ కలెక్టరు అభినందిస్తూ జిల్లాలో వారు అందించిన సేవలను కొనియాడారు.

నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి

బొబ్బిలి: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులతో పాటు పలు వర్గాల వారికి సంక్షేమపథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోదరరావు, డి.సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. అన్న క్యాంటీన్లను ప్రారంభించినట్లే మిగిలిన హామీలను కూడా నెరవేర్చాలన్నారు. వందరోజుల పండుగ జరుపుకుంటున్న దశలో ఈ హామీలన్నిటిపైనా దృష్టిసారించాలన్నారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురంలో మంగళవారం ఏడీఏ శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో డ్రోన్‌తో తక్కువ ఖర్చుతో పంట పొలాలపై మందులు పిచికారి చేసే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. స్వామినాయుడు అనే రైతు వరి పొలంలో పురుగుల మందును స్ప్రే చేశారు. రైతులు, డ్రోన్ ఆపరేటర్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు శత శాతం పూర్తిచేయాలి

రామభద్రపురం: 'మన ఇళ్లు మన గౌరవం' కార్యక్రమం కింద మంజూరైన ఇళ్లు శతశాతం నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమామణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నోడల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో హౌసింగ్ డీఈ పలగర అప్పయ్య, ఈవోపీఆర్‌డీ అక్కరావు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 మార్చి నాటికి ఇప్పటివరకు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో శతశాతం పూర్తి నిర్మాణాలు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పారదర్శకంగా వ్యవహరించి లబ్ధిదారులకు పథకం వివరాలు తెలియజేసి నిర్మాణాలు వేగవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలి: పట్టణంలో విద్యుత్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సీపీఎం నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ బొబ్బిలి పట్టణ పరిధిలో సుమారు 27 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, తరచూ గాలివానలు సంభవిస్తుండడంతో విద్యుత్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పట్టణ విద్యుత్ వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా అదనపు సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే బేబీనాయన, విద్యుత్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని శంకరరావు కోరారు. ఎస్.గోపాలం, యుగంధర్, ప్రసాద్, త్రినాథ్ పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్: మండల పరిధిలో గల రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎస్ గోపాలం ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి త్రినాథ, వుడమల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపేందుకే సంకల్పం

విజయనగరం క్రైం: నేడు సమాజం ఎదుర్కొన్న సమస్యల్లో యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారటమే ప్రధానమైందని, వారిని సన్మార్గంలో నడిపేందుకు జిల్లా పోలీసు శాఖ సంకల్పం అనే కార్యక్రమాన్ని రూపొందించిందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఇంపేక్టర్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎం.వేంకటేశ్వరావు, వినోద్‌కుమార్, శశిభూషనరావు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య మహిళా మెడికోల అంత్యక్రియలు

బొబ్బిలి/బాడంగి: అల్లూరి జిల్లా మారేడిమిల్లి జలతరంగిణి జలపాతంలో కొట్టుకుపోయి దుర్మరణం పాలైన మహిళా మెడికోల అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాలతో ముగిశాయి. బొబ్బిలి పట్టణంలోని రావువారివీధికి చెందిన కొసిరెడ్డి సౌమ్య, బాడంగి మండలం డొంకినవలస రైల్వేస్టేషన్‌కు చెందిన అమృత ఈ ప్రమాదంలో అశువులు బాసిన సంగతి తెలిసిందే. ఈ రెండు మృతదేహాలు సోమవారం రాత్రి వారి స్వగృహాలకు బంధువులు తీసుకురాగా, మంగళవారం ఉదయం బంధువులు, స్నేహితులు పెద్దసంఖ్యలో తరలిరాగా వేర్వేరుగా అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన రావువారివీధికి వెళ్లి సౌమ్య తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు.

చదవుతో పాటు క్రీడలు అవసరం

శృంగవరపుకోట, సెప్టెంబరు 24: చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్ 14 నుంచి 17 సంవత్సరాల బాల బాలికల మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడలు ఆరోగ్యంను పెంపొందిస్తాయన్నారు. వాలీబాల్, కోకో, ఇతర ఆటల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా అని ఆరా తీశారు. ఎంపీపీ సండిసోమేశ్వరరావు, వైఎస్ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ అరుణ కుమారి, ఎంఈవో నర్సింగరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.రామకృష్ణ, కోఆర్డనేటర్ పొట్నూరు శ్రీరాములు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కాపుగంటి శ్రీనివాసరావు(వాసు), ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెక్క. కిరణ్ కుమార్ ఉన్నారు.



ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో షార్ట్‌పుట్ విసిరి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయం



రేజేరు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

వేపాడ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో వ్యవసాయశాఖ సారథ్యంలో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సాగులో రైతులకు ఎదురయ్యే సమస్యలను ఆటంకాలను, ఇబ్బందులను అధిగమించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అనంతరం సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీపీ దాసరి లక్ష్మి, పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు, పలువురు పార్టీ నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ముంగిట్లో వ్యవసాయ అనుబంధ శాఖలు సేవలందించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్, మండల వ్యవసాయాధికారి కే.శిరీష, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, మండల పార్టీ అధ్యక్షులు తెంటు రవిబాబు, బొంత త్రినాథ్, బొ మ్మి జగన్నాథంనాయుడు, గులిపల్లి రాము, నాయకులు, రైతుల, వ్యవసాయశాఖ సి బ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవం ఏర్పాట్లకు పక్కా ప్రణాళిక



సిరిమాను తిరిగే ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ నల్లనయ్య, అధికారులు

విజయనగరం రింగురోడ్డు: పైడిమాంబ సిరిమానోత్సవానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య అన్నారు. మంగళవారం సిరిమాను తరలింపు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులు, పూజారి బంటుపల్లి వెంకటరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిమాను తరలించే ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జమ్ము ప్రాంతం నుంచి రింగురోడ్డు, ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్, అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, వనం గుడి, ఎన్‌సీఎస్, గంటస్తంభం, చదురు గుడి మీదుగా హుకుంపేట తదితర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడక్కడ చిన్న గుంతలను ఉన్నట్టు గుర్తించి వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించారు.

తిరుపతి లడ్డూపై నిజాలు తేల్చాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి లడ్డూపై నిజనిజాలను నిగ్గు తేల్చి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా దుప్పాడ శ్రీక్షేత్రంలో జనసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్విని, లక్ష్మీ, దేవుడు, రాజేష్, నవీన్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ● ఇటీవల కురిసిన వర్షానికి దుప్పాడలో ఇళ్లు కూలిపోయిన బాధితుడికి జనసేన నాయకులు గురాన అయ్యలు నిత్యావసర వస్తువులు అందజేశారు. ● **బొబ్బిలి:** జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన నేపథ్యంలో మంగళవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో జనసైనికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నాయకుడు పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబి) ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మనోజ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని రంగాలలో అనేక రకాల అరాచకాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. లడ్డూ అపవిత్రతకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

సామగ్రి బహిరంగ వేలం

రాజాం: పురపాలక సంఘం పరిధిలో ఇనుము, అల్యూమినియం, ప్లాస్టిక్, పేపర్లు, అట్టలు, తదితర పాత సామగ్రిని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం బహిరంగ వేలం వేశారు. ఈ వేలంలో 8మంది పాల్గొనగా, ఎస్‌కే అబ్దుల్ రషీద్ పాట దక్కించుకున్నారు. మేనేజరు కె.శ్రీనివాస్, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తవలస: మండలంలోని రైతులు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ నీలకంఠారావుకు వినతిపత్రం అందజేశారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలను ఇవ్వాలని, అన్ని పంటలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. నిమ్మలపాలెంకు చెందిన రైతు సంఘం నాయకుడు గొంప కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

అనుమతి లేని మందుగుండు విక్రయాలు వద్దు

రామభద్రపురం: మండలంలో అక్రమంగా మందుగుండు సామాన్లు తయారుచేసినా, నిల్వ ఉంచినా వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెలమల ప్రసాదరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గతంలో కొట్టక్కి, మిర్తివలసలోని ఎరుకులపాలకు సంబంధించి 5 మంది వ్యక్తులు మందుగుండు సామగ్రి కలిగి ఉండడంతో ఇప్పుడు వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

పారిశుధ్య కార్మికులే ప్రజారోగ్యదాతలు

రింగురోడ్డు: పారిశుధ్య కార్మికులే ప్రజారోగ్య ప్రదాతలని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికుల సత్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు



జామి: జామి బస్టాండ్ వద్ద ప్రమాదాలు జరగకుండా టీడీపీ మండలపార్టీ కార్యదర్శి వర్రి రమణ ఆధ్వర్యంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. మంగళవారం వీటి ఏర్పాటు చూసిన స్థానికులు, వాహనదారులు టీడీపీ నాయకులను అభినందించారు. ఇటీవల స్పీడ్‌బ్రేకర్లు ఈప్రాంతంలో లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరగడంతో ఈ పని చేశామని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బోనీ జీవన్, గొంప శ్రీరామూర్తి, చొక్కాకుల అప్పన్న తదితరులున్నారు.

పదవులు అలంకారం కాదు.. బాధ్యత: అశోక్



అశోక్‌ను కలిసిన బంగార్రాజు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): పదవులు అలంకారం కాదని దాన్ని బాధ్యతగా భావించి ప్రజలకు సేవలందించినప్పుడే పదవులకు గౌరవం అని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి కర్రోతు బంగార్రాజుకు ఆంధ్రప్రదేశ్ మార్కెఫెడ్ చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా మంగళవారం అశోక్ గజపతిరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ● ఏపీ రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్‌గా ఎంపికైన , నెల్లిమర్ల టీడీపీ ఇంచార్జ్ కర్రోతు బంగార్రా జుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలుపుతూ, మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. బంగార్రాజుకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమం త్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

30న మహిళా గర్జన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించేందుకు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వాజీ చానల్, మహిళా గర్జన కమిటీ సంయుక్తంగా ఈ నెల 30న 9 గంటలకు కోట జంక్షన్ వద్ద మహిళా గర్జన పేరుతో బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈ సందర్భంగా పోస్టర్‌ని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వాజీ చానల్ ఎండీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుల నిరసన



గంటస్తంభంవద్ద బీజేపీ ధర్నా

దాసన్నపేట: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఇటీవల అమెరికాలో భారత రాజ్యాంగంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం బీజేపీ నాయకులు నగరంలో గంటస్తంభం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని మాట్లాడుతూ రాహుల్ గాంధీ తన వాఖ్యాలను వెంటనే వెనక్కి తీసుకోవాని, లేదంటే ఆయన పాస్‌పోర్టును రద్దుచెయ్యాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు శివప్రసాద్ రెడ్డి, హరనాథ్, అమ్మాజీ, శ్రీధర్, సుధీర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని పెదవే మలి గ్రామానికి చెందిన వర్రి అవతారం(25) అనే యువకుడు అప్పుల బాధ తాళలేక మంగళవారం రాత్రి లక్కిడాం గ్రామంలోని ఓ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అవతారం వివిధ కారణాలతో తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి కూడా తీసుకెళ్లాడు. కొద్ది రోజుల క్రితం తాతగారి ఊరైన లక్కిడాం వచ్చాడు. అక్కడ తన మిత్రులతో కలసి ఓ ఇంట్లో ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

రాజాం రూరల్: రాజాం-పాలకొండ రోడ్డులో పాన్‌షాప్‌లో మద్యం అమ్ముతున్న వడ్డిపల్లి గౌరినాయుడు నుంచి మంగళవారం మధ్యాహ్నం 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. అయితే మద్యం సీసాలు పట్టుకున్న ఎనిమిది గంటల తర్వాత రాత్రి సమ యంలో కేసు నమోదు చేశారు. దీనిపై పలుఅనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం

రాజాం రూరల్: రెండేళ్లకోసారి రాజాంలో నెలరోజుల పాటు నిర్వహించే రాజాం, సారధి గ్రామ దేవతలు కోటదుర్గమ్మ తల్లి, బురదల పోలమ్మతల్లి, బంగారమ్మ తల్లి, దుర్గమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బురదల పోలమ్మతల్లి ఘటం తిరువీధి ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కుమ్మరివీధిలోని అమ్మవార్ల ఆలయం వద్ద మంగళవారం ఉదయం అయిదు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

బొబ్బిలి/రూరల్: బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యుత్ శాఖ జేఈ ఎల్లంనాయుడుపై పలువురు మండిపడ్డారు. రెవెన్యూ శాఖపై జరిగిన చర్చలో గత ప్రభుత్వ హయాంలో భూ రీసర్వే కార్యక్రమం చేపట్టారని, దీనివల్ల భూ రిజిస్ట్రేషన్స్ సక్రమంగా అవడంలేదని దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని తహసీల్దార్ శ్రీనును పలువురు కోరారు. కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో భర్తలు, బంధువులదే హవా

బొబ్బిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు బదులుగా వారి భర్తలు, బంధువులే హాజరవడం గమనార్హం. వైస్ ఎంపీపీ, మెట్టవలస ఎంపీటీసీ అరసాడ శంకరరావు అధ్యక్షతన మంగళవారం మండలపరిషత్ సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సమావేశానికి అసలు ప్రజాప్రతినిధులకు బదులుగా వారి నకలుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీల భర్తలు, వారి బంధువులే తమ దర్పాను, ఠీవిని, దర్పాన్ని వెలగబెట్టారు. మంగళవారం జరిగిన సర్వసభ్యసమావేశంలో వైసీపీకి చెందిన పారాది సర్పంచ్ మామ ఉత్తరావల్లి అప్పలనాయుడు (మండల వైసీపీ అధ్యక్షుడు), జగన్నాథపురం గ్రామ సర్పంచ్ బొద్దల పద్మావతి భర్త వైసీపీ అధికార ప్రతినిధి బొద్దల సత్యనారాయణ తమ దైన శైలిలో అధికారులను ప్రజాసమస్యలపై నిలదీశారు. అన్ని శాఖలపై జరిగిన చర్చల్లో వారు ప్రత్యక్షంగానే పాల్గొనడమే కాక, అధికారులపై మైకు పట్టుకొని ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు సైతం బుద్ధిగా వారికి సమాధానం చెప్పడం గమనార్హం. ప్రస్తుత అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళా ప్రతినిధుల భర్తలు సైతం తామేమీ తీసిపోమన్నట్లుగా వ్యవహరించారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న జగన్నాథపురం సర్పంచి భర్త సత్యనారాయణ

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

గరివిడి: గరివిడి డిగ్రీ కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొని కేఎల్‌పురం గ్రామానికి చెందిన నవీన్ కుమార్ (31) మృతి చెందాడు. గ్రామంలో అమ్మవారి వారాలు అవుతుండడంతో వంటనూనె కొనుగోలు చేసేందుకు నవీన్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గరివిడి వస్తుండగా విజయనగరం నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గరివిడి పోలీసులు తెలిపారు.

నేలబావిలో పడి రైతు..

రేగిడి: జోడుబందల గ్రామంలో నేలబావిలో పడి బొత్స తాతబాబు (42) అనే రైతు మృతి చెందాడు. ఈయన మృతదేహం మంగళవారం బయటపడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నీలావతి వివరాల మేరకు.. తాతబాబు తన అత్త వారి గ్రామం వీరఘట్టం మండలం రేగులపాడులో నివాసం ఉంటున్నాడు. వారానికి ఒకసారి జోడుబందలోని తన పొలం చూసేందుకు వచ్చి వెళ్లిపోతుంటాడు. ఇదే విధంగా మూడురోజుల కిందట జోడుబందల వచ్చిన తాతబాబు ఊరు చివరలో ఉన్న పొలంవైపు వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆయన నేలబావిలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయనకు భార్య గీత, ఇద్దరు కుమారుడు ఉన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు దోచుకున్న కేసులో ఒకరి అరెస్టు

విజయనగరం క్రైం: ఓ వ్యక్తి నుంచి బలవంతంగా నగదు దోచుకెళ్లిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన నక్కాన లక్ష్మణరావు తన కుటుంబ సభ్యుల ఎల్ఐసీ పాలసీ రెన్యువల్ కోసం నగదు తీసుకుని విజయనగరంలోని ఎల్ఐసీ కార్యాలయానికి సోమవారం వెళ్లాడు. కార్యాలయంలో టెక్నికల్ సమస్య రావడంతో పాలసీ కట్టలేదు. నగదుతో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న వైన్‌షాపు వద్దకు వెళ్లగా అక్కడ గుర్తు తెలియని వ్యక్తి లక్ష్మణరావును పరిచయం చేసుకున్నాడు. స్కూటీపై లక్ష్మణరావును ఎక్కించుకుని మార్గమధ్యలో ఆయన్ను బెదిరించి రూ.50 వేలను లాక్కోని పరారయ్యాడు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడ్ని గుర్తించారు. మంగళవారం పద్మావతి నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల అల్లినగరానికి చెందిన బసవ కనకరాజు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని నుంచి రూ.38,500 నగదు, లక్ష్మణరావు ఆధార్ కార్డులతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. కనకరాజును అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

18 మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని ఆకులరెల్లివీధి శివారులో సిరుగడు వీధికి చెందిన ఎ.శంకరరావు అనే వ్యక్తి నుంచి మంగళవారం సాయంత్రం 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. సీఐ కటకం సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మద్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామని, ఈక్రమంలో మద్యం అమ్ముతున్న శంకరరావును పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మద్యం విలువ రూ.2,340 ఉంటుందని తెలిపారు.

సాలూరులో యువకుల కొట్లాట

● హెడ్ కానిస్టేబుల్‌తో సహా నలుగురికి గాయాలు

● 40 మందిపై కేసు

సాలూరు రూరల్: పుట్టినరోజు వేడుకల్లో రెండు వీధులకు చెందిన యువకుల మధ్య కొట్లాట జరిగింది. ఈ కొట్లాటను ఆపేందుకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌తో సహా నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై సాలూరు పట్టణ పోలీసులు మంగళవారం తెలిసిన వివరాలిలా ఉన్నాయి. సాలూరులోని ఒక వీధిలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక యువకుడి పుట్టినరోజు వేడుకలను స్నేహితులు నిర్వహించారు. అదే సమయంలో అటుగా వెళ్లిన మరో వీధికి చెందినవారికి, వీరికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఇరు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ కొట్లాటకు నివారించడానికి వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ సత్యంనాయుడుతో సహా నలుగురు పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనపై సాలూరు పట్టణ సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఇరు వీధులకు చెందిన 40 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వలపన్ని పట్టుకున్నారు

● బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● 16 తులాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

పార్వతీపురం టౌన్: మాయమాటలు చెప్పి మేనత్తను మోసం చేసి బంగారాన్ని దోచుకున్న వ్యక్తిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ అంకిత సురానా మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన కంది మణిమ్మ ఇంటికి రాజమండ్రికి చెందిన ఆమె మేనల్లుడు కె.లక్ష్మణరావు జూలై 26వ తేదీన వచ్చాడు. మణిమ్మ కుమార్తెకు వివాహం కుదుర్చుతానని మాయమాటలు చెప్పాడు. 27న ఉదయం 5 గంటల సమయంలో మణిమ్మ ఇంటిలోగల బీరువాలోని 16.5 తులాల బంగారాన్ని చోరీ చేసి పారిపోయాడు. ఈనెల 18న బాధితురాలి ఫిర్యాదు మేరకు పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో మంగళవారం లక్ష్మణరావు తాను చోరీ చేసిన బంగారాన్ని పార్వతీపురం పట్టణంలో అమ్మడానికి వస్తుండగా.. నర్సిపురం గ్రామ సమీపంలో సీఐతో పాటు ఎస్ఐ దినకర్, రూరల్ పోలీసులు, సీసీఎస్ సిబ్బంది వలపన్ని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ, ఎస్ఐలతోపాటు సిబ్బంది, సీసీఎస్ టీంకు ఏఎస్పీ అభినందనలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా

బొబ్బిలి రూరల్: పెంట గ్రామ సమీపంలోని వేగావతి నది నుంచి బొబ్బిలి గ్రోత్ సెంటర్‌కి మంగళవారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఎం.బూర్జివలస సమీపంలో పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వీటిని పోలీసు స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. **రేగిడి:** మండలంలో బూరాడ- లచ్చన్నవలస సెంటర్ వద్ద సోమవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు. తాటిపాడు మార్గంలో ఇసుక డంప్ చేసి లారీలతో అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ నీలావతి ఇసుక లారీని పట్టుకున్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. Ph:9160900024 / 9640400073
AJH-15243

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మింపబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266